క్లుప్తంగా

బాధితులకు దుప్పట్ల పంపిణీ



నందిగామ టౌన్: వరద బాధితులను ఆదుకునేందుకు మాజీ సైనికులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మాజీ సైనికుల వితరణతో 60మందికి దుస్తులు నిత్యావసర సరుకులు, తాళ్లూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో 100మందికి దుప్పట్లను సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తాళ్లూరి ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ట్రస్ట్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించాలని వినతి



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): ఇటీవల సంభవించిన వరదలకు మండలంలోని ముచ్చింతాల యూపీ పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరింది. మునేరు వరదలకు పాఠశాల చుట్టూ ప్రహరీ పడిపోవటంతోపాటు పాఠశాలంతా వరద నీరు పోటెత్తింది. వరద చుట్టూత పేరుకుపోయిన వరద బురద, చెత్తాచెదారం కారణంగా దుర్వాసన వెదజల్లుతుండటంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల ఆవరణలో మురుగు నిల్వలేకుండా చూడాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐక్యత చాటిన పెనుగంచిప్రోలువాసులు



పెనుగంచిప్రోలు: మిలాద్–ఉన్–నబీ వేడుకలను మండలంలో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పెనుగంచిప్రోలులో ఒకరికొకకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈసందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు పురస్కరించుకుని ఈపండుగ జరుపుకుంటారని వివరించారు. . అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వీరి ర్యాలీకి గణేష్ నిమజ్జన ఉత్సవంలో ఉన్నవారు కూడా మద్దతు తెలిపి తమ ఐక్యత చాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జయంతిపురం(జగ్గయ్యపేట): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటలని రామ్‌కో ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ సూచించారు. గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామ్‌కో వైస్ ప్రెసిడెంట్ మూర్తిరావు, అడ్మిన్ ఫరూక్‌మహ్మద్, డీజీఎం రామకృష్ణసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన తిరుపతిరావు

కంచికచర్ల : రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటనలు సోమవారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం మేరకు..కంచికచర్లకు చెందిన ఉప్పుతల తిరుపతిరావు ఇబ్రహీంపట్నంలో విధులు ముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా, పరిటాల సమీపంలోకి వెనుక నుంచి గుర్తుతెలియనివాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా దొనబండ రాతి క్వారీలో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన గౌడ్ అనే వ్యక్తి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనల్లో తీవ్రంగా గాయపడిన వారిద్దరిని 108 సిబ్బంది విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిరావుకు తీవ్రగాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితులకు అండగా నిలవాలి

తాటిగుమ్మి(వీరులపాడు): వరద బాధితులకు అందరూ సహాయమందించాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిఎస్ పాల్ సూచించారు. తాటిగుమ్మిలో సోమవారం పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. రాజేంద్ర, సంసోను, సీయోన్‌కుమార్, సామ్యేల్ రాజు, స్వామిదాసు పాల్గొన్నారు.



పేటలోని రైతుబజారు వద్ద వరసిద్ది వినాయకుని ఆలయంలోని స్వామివారిని పూలరథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం



నిమజ్జనానికి తరలుతున్న నందిగామ గాంధీసెంటర్ వినాయకుడు



నందిగామ వాసవీమార్కెట్‌లో స్వామివారికి పూజలు చేస్తున్న శ్రీరాం చిన్నబాబు, వ్యాపారులు



నిమజ్జనానికి బయలుదేరిన రైతుపేటడౌన్ గణనాథుడు



జగ్గయ్యపేట: నిమజ్జనానికి వెళ్తున్న విగ్రహాలు



జగ్గయ్యపేటలో గణనాథుడిని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



మక్కపేటలో వినాయకుడి ఊరేగింపు

శోభాయమానంగా

వినాయక నిమజ్జనాలు

వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సోమవారం అత్యంత శోభాయమానంగా సాగాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయకుడి విగ్రహాలను ట్రాక్టర్లు, ప్రత్యేక వాహనాలపై ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. కనకతప్పెట్లు, మేళతాళాలు, డీజే సౌండ్‌లు, తీన్‌మార్ నృత్యాలతో యువతీయువకులు కేరింతలు కొట్టారు. బాణసంచా కాల్పులతో భక్తులు సందడి చేశారు. గణపతి బప్పా మోరియా.. జైజై గణేశా..బైబై గణేశా నినాదాలతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. జగ్గయ్యపేట, నందిగామ పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద స్వామివార్ల విగ్రహాలకు భక్తులు ఎదురేగి పూజలు చేశారు. ఊరేగింపు అనంతరం వినాయకుడి విగ్రహాలకు పూజలు చేసి కంచికచర్ల మండలం కీసర మునేరు వద్ద, జగ్గయ్యపేట మండలం వేదాద్రి, పెనుగంచిప్రోలులో మునేరులో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ ఆధ్వర్యంలో ఆయా పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

–నందిగామటౌన్, జగ్గయ్యపేట, జగ్గయ్యపేటఅర్బన్, పెనుగంచిప్రోలు, కంచికచర్ల, వీరులపాడు, వత్సవాయి



మునేరుకు నిమజ్జనానికి వచ్చిన పెనుగంచిప్రోలు బురుజు సెంటర్‌లోని గణనాథుని ఊరేగింపు



కంచికచర్లలో పూజలుచేస్తున్న భక్తులు



నందిగామ మెయిన్‌బజారులో కొలువుదీరిన వినాయకుడు



పెనుగంచిప్రోలులో గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు



వీరులపాడు మండలం పల్లంపల్లిలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు



పెనుగంచిప్రోలు అమ్మవారి ఆలయ గణనాథుడితో పూజారులు



జగ్గయ్యపేట పట్టణంలో వినాయడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కంచికచర్లలో అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



పెనుగంచిప్రోలులో నిమజ్జనానికి ముందు స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



జగ్గయ్యపేట చెరుకూరిబజారులో వినాయకుడితో భక్తులు



వేదాద్రి కృష్ణానది ఘాట్ వద్ద భక్తుల కోలాహలం

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



ముస్లింసోదరుడిని ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెబుతున్న డాక్టర్ జగన్‌మోహనరావు



జుజ్జూరులో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ చేస్తున్న ముస్లింలు



పేటలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

నందిగామ టౌన్: మహ్మద్ ప్రవక్త జీవనశైలి సర్వ మానవాళికి జీవనమార్గమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా పట్టణంలో ముస్లింలు సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ముస్లింలను పేరుపేరున పలుకరిస్తూ ఆత్మీయ ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతిఫలం ఆశించకుండా తోటివారికి సహాయపడితేనే మహ్మద్‌ప్రవక్త ఆశయం నెరవేరినట్లన్నారు. ప్రేమ, దయ, కరుణ, నమ్మకంతో ముందుకు సాగుతూ సమాజసేవకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముతావలి మహ్మద్ ఖాజా, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు షేక్ మున్నా, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పాకాలపాటి కిరణ్, రజ్వీ, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముస్లింలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు..

ముస్లింలకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలంతా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. మహ్మద్‌ప్రవక్త బోధనలు అందరికీ అనుసరణీయమని పేర్కొన్నారు.

వీరులపాడు మండలంలో...

జుజ్జూరు(వీరులపాడు):శాంతి సహనానికి ప్రతీకగా నిలిచే మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జుజ్జూరులోని గౌసియా జామియా మసీదులో మహ్మద్ ప్రవక్త జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ముస్లింలు గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో షేక్ నాగుల్‌మీరా, అనీఫ్, ఖాజా, మౌలాలి, తాజుద్దీన్ బాబా, జలాలుద్దిన్, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: మిలాదున్ నబీ పండుగ వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీదులో ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా కాగితాల బజారులోని మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ సత్తార్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, టీడీపీ నాయకుడు ఖాసిం తదితరులు పాల్గొన్నారు. ఒకరికొకరు మిలాదున్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ 1996 పదో తరగతి బ్యాచ్ విద్యార్థిని ఆళ్ల దుర్గాభవాని ఈ నెల 8న క్యాన్సర్‌తో మృతి చెందింది. ఆమె కుటుంబానికి ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. మృతురాలు దుర్గాభవానితో పాటు చదువుకున్న క్లాస్‌మేట్స్ చందు(కానిస్టేబుల్), సాంబ, శ్రీను సోమవారం స్థానిక రావిచెట్టు సెంటర్‌లోనే ఉంటున్న దుర్గాభవానీ సోదరి కొలుసు అనసూయ ఇంటికి వెళ్లి రూ.20 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ.. ఆ పేద కుటుంబానికి తమ వంతు సాయంగా కొందరు క్లాస్‌మేట్స్ సహకారంతో ఆర్థిక సాయాన్ని అందించామని తెలిపారు.

విద్యార్థికి సత్కారం



విద్యార్థి మోహిత్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విష్ణుప్రియనగర్‌కు చెందిన కోంద్రు మోహిత్ గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో సోమవారం మోహిత్ కలిశారు. ఎమ్మెల్యే తాతయ్య విద్యార్థి మోహిత్‌ను సత్కరించి అభినందించారు. వైద్య విద్యను పూర్తి చేసి పేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. విద్యార్థి తండ్రి, ఉపాధ్యాయుడు కోంద్రు వెంకటరత్నం కుటుంబం, వీసీహెచ్.వెంకటేశ్వర్లు, జె.సుదానంద్, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం ప్రసంగం వీక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

జగ్గయ్యపేట అర్బన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో పీఎం అవాజ్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు సోమవారం తెలిపారు.మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యే పీఎం మోదీ ప్రసంగాన్ని ప్రజలు తిలకించేందుకు స్థానిక ఉక్కు కళావేదికలో తగిన ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరవుతారని కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

కొట్టుకుపోయిన డొంకరోడ్లు



గొట్టుముక్కల ఏనుగుగడ్డ వాగు వద్ద దెబ్బతిన్న డొంక రోడ్డు

కంచికచర్ల : ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదల ఉధృతికి నందిగామ నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో డొంకరోడ్లు కొట్టుకుపోయాయి. కంచికచర్ల మండలం గొట్టుముక్కల సమీపంలోని కట్టెలవాగు వద్దనున్న డొంకరోడ్డు ధ్వంసం కావడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. పొలాలకు నడిచి వెళ్లేందుకు మార్గంలేకపోవడంతో కూలీలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. వరద ఉధృతికి ఏనుగుగడ్డ వాగు కూడా దెబ్బతింది. కొండపల్లి రిజర్వు ఫారెస్టు వద్ద కొలువై ఉన్న మద్దులమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రోడ్డు కూడా ఈ వర్షాలకు ధ్వంసమైంది. అధికారులు స్పందించి వరదలకు దెబ్బతిన్న డొంకరోడ్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు, కూలీలు, ప్రజలు కోరుతున్నారు.